

అంబేడ్కర్ స్మృతివనంకు విరామం

పటమట(విజయవాడతూర్పు): అంబేడ్కర్ స్మృతివనంకు శుక్రవారం సాయంత్రం 3–6 గంటల మధ్య సందర్శకులకు అనుమతి లేదని స్మృతివనం ఇన్‌చార్జి మాల్యాద్రి తెలిపారు.



వైభవంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ రాంబాబు గిరిప్రదక్షిణను ప్రారంభించారు.

వికసించిన 'పద్మ'ం



సాక్షి, మచిలీపట్నం: కృష్ణాజిల్లా కళాకారిణిని 'పద్మం' వరించింది. బందరుకు చెందిన హరికథా కళాకారిణి దాలిపర్తి ఉమామహేశ్వరికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది.

న్యూస్‌రీల్

అడిషనల్ డైరెక్టర్‌గా రమేష్‌కుమార్



మచిలీపట్నంటౌన్: మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్‌గా జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ జీఎస్ రమేష్‌కుమార్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఈయన విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఆప్తమాలజీ విభాగ హెచ్‌వోడీగా పని చేస్తున్నారు. రమేష్‌కుమార్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతితో పాటు స్థానిక జీజీహెచ్‌కు పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

29న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం ఈనెల 29వ తేదీ సోమవారం జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన పరిపాలనా భవనంలో ఉన్న బోర్డు మీటింగ్ హాల్‌లో సోమవారం ఉదయం 10–30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈవో కేఎస్ రామారావుతో పాటు పాలక మండలి సభ్యులు, ఆలయానికి చెందిన వివిధ విభాగాల ముఖ్య అధికారులు హాజరుకానున్నారు. భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లకు సంబంధించి పలు అంశాలతో పాటు ఫిబ్రవరిలో జరగనున్న మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవ ఏర్పాట్ల గురించి సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఐఆర్ఐఏ జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ వరప్రసాద్



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇండియన్ రేడియాలజిక్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఏ) జాతీయ అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన డాక్టర్ వీఎస్ వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి సమీపంలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ప్రారంభమైన 76వ జాతీయ సదస్సులో తొలిరోజు అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వీఎస్ వరప్రసాద్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించిన డాక్టర్ ఉమేష్ కృష్ణమూర్తి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ వరప్రసాద్ గతంలో ఐఆర్ఐఏ జాతీయ ఉపాధ్యక్షుడిగా, ఐసీఆర్ఏ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఏషియన్ మస్కులో స్కెలెటల్ సొసైటీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌కు జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ మోహన్‌ప్రసాద్ విజయవాడకు చెందిన పలువురు రేడియాలజిస్టులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి బీసీసీఐ అండర్–23 మహిళల క్రికెట్ మ్యాచ్‌లు

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 26వ తేదీ నుంచి మంగళగిరి, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) మైదానాల్లో బీసీసీఐ అండర్–23 మహిళల క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్నట్లు ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి ఏడో తేదీ వరకు జరిగే ఈ మ్యాచ్‌లకు హైదరాబాద్, మేఘాలయ, బరోడా, విదర్భ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని, టాప్ –2 జట్లు నాకవుట్ పద్ధతిలో తలపడతాయని వివరించారు. ఇప్పటికే జట్లు విజయవాడకు చేరుకుని, ఆయా మైదానాల సమీపంలో ఏర్పాటు చేసిన నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాయని తెలిపారు. శుక్రవారం డీవీఆర్ మైదానంలో బరోడా–విదర్భ, సీపీ మైదానంలో హైదరాబాద్–ఉత్తరాఖండ్, మంగళగిరిలో మేఘాలయ–ఉత్తరప్రదేశ్ జట్లు తలపడతాయని స్పష్టం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

– డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం ఉద్యోగులతో ఆయన ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అర్హత పొందిన ఓటర్లను సత్కరించి వారికి కొత్తగా మంజూరైన ఓటరు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంతో సహా అన్నింటా

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, పక్కన వెలంపల్లి

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- అట్టహాసంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం



సెంట్రల్ నియోజక వర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంతో సహా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీలతో విజయ ఢంకా మోగిస్తుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో అట్టహాసంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సజ్జల మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కన్న కలలను నెరవేరుస్తూ, ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, నాలుగున్నరేళ్లుగా వాటిని దిగ్విజయంగా అమలుచేసి చూపడమే దీనికి నిదర్శనమన్నారు. నిరుపేద ప్రజలు ఎవరి కాళ్ల మీద వారు నిలబడేలా డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం ద్వారా రుణాలు, రోడ్ల వెంబడి చిరువ్యాపారులకు ఆర్థిక సహాయం అందించి చేయూతను ఇస్తున్నారన్నారు. ఇలా రాష్ట్రంలోని సుమారు నాలుగు కోట్ల మంది నిరుపేద ప్రజల్లో 60 నుంచి 70 శాతం మంది ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాల ద్వారా వారి అకౌంట్లలో నగదు జమ చేస్తున్నామని వివరించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు అన్యాయం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని, తాను అధికారంలో ఉన్నప్పుడు గుంటూరు, విజయవాడ నగరాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడ నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేశారన్నారు. పేద ప్రజలకు మేలు జరిగితే చంద్రబాబు తట్టుకోలేడని.. పేదలకు ఇళ్లు ఇచ్చినా, నిరుపేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదివించినా ఆయన ఓర్వలేకపోతున్నాడని దుయ్యబట్టారు. గత రెండున్నరేళ్ల నుంచి తన ఎల్లో మీడియాతో అసత్యాలను ప్రచారం చేయిస్తూ చంద్రబాబు రాష్ట్రంలో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కుప్పంలో ఇప్పటికే మనం విజయం సాధించామని, కుప్పంలో పంచాయతీలు, మండల పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచిందని గుర్తుచేశారు. తాను ఇప్పుడు కుప్పంలో కూడా ఓడిపోతానని తెలుసుకుని చంద్రబాబు వేరే నియోజకవర్గం వైపునకు చూస్తున్నాడని, మనమంతా చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాలన్నింటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, కలసికట్టుగా 175 నియోజకవర్గాల్లో విజయాన్ని సాధించే వరకూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విజయవాడ నగరంలో ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, తూర్పు నియోజకర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ ఉమ్మడిగా ముందుకు వెళ్తూ నగరంలోని మూడు సీట్లు కచ్చితంగా గెలుస్తారని, అలానే ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కూడా వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించి క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్, పూనూరు గౌతమ్‌రెడ్డి, అడపా శేషు, షేక్ ఆసిఫ్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.



• గణతంత్ర దిన వేడుకలకు సర్వం సిద్ధం

ఎన్టీఆర్ జిల్లాలో 75వ గణతంత్ర దిన వేడుకలకు విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రాంగణం లోపల చుట్టూతా మూడు రంగులతో కూడుకున్న క్లాత్‌తో కవర్ చేశారు. మైదానం మొత్తం చదును చేసి శుభ్రం చేశారు. స్టేడియం ముఖద్వారం రంగురంగుల విద్యుద్దీపాల కాంతులతో ధగధగా మెరిసిపోతోంది. వివిధ శాఖలకు సంబంధించి వేడుకలలో ప్రదర్శించే శకటాలను అందంగా తయారు చేసి సిద్ధం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ వి.జ్యోతిబసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లాపరిషత్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

స్థాయీ సంఘ సమావేశాలు

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన ప్లానింగ్, ఆర్థికం, గ్రామీణాభివృద్ధి సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశం, చైర్‌పర్సన్ అధ్యక్షతన విద్య, వైద్యం స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు దుట్టా సీతారామలక్ష్మి అధ్యక్షతన స్త్రీ, శిశు సంక్షేమం, వైస్ చైర్మన్ గుదిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షతన సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన పనులపై స్థాయి సంఘ సమావేశం జరుగుతుందన్నారు.

వెల్‌డన్ 'ఢిల్లీ'.. కీపిట్ అప్

గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్ ఢిల్లీరావు



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని ప్రజలకు చాటిచెప్పి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించడంలో జిల్లాలో అందించిన సేవలు అనిర్వచనీయమని, ఇదేవిధంగా ఎన్నికల ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించడంలో సఫలీకృతం కావాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛమైన, ఆరోగ్యకర ఓటర్ల జాబితా రూపకల్పనలో, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల్లో విశిష్ట సేవలందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు ఎన్నికల ప్రక్రియ కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకర, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలను సమన్వయం చేసుకుంటూ, నిరంతర మార్గనిర్దేశనంతో పారదర్శకమైన ఓటర్ల జాబితాకు రూపకల్పన చేయడంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చూపిన చొరవ అభినందనీయమన్నారు.

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లా అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలకు అప్పగించిన బాధ్యతలను వారంతా సమష్టి కృషితో సమర్థంగా నిర్వహించడం ద్వారానే ఈ పురస్కారం లభించిందన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పురస్కారం లభించినట్లుగా భావిస్తున్నానన్నారు. ఓటు నమోదుపై ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆశించిన స్థాయిలో ఓటర్లను నమోదు చేయడంలో జిల్లాను ముందు వరుసలో నిలపడం అభినందనీయమన్నారు. చేసిన కృషిని గుర్తించి జిల్లాకు అవార్డును అందించినందుకు గవర్నర్, ఈసీఐ, సీఈవోలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

తిరుపతమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.1.21 కోట్లు



హుండీ కానుకల లెక్కింపులో ఈఓ, చైర్మన్, పాలకవర్గ సభ్యులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారికి భక్తులు హుండీల ద్వారా రూ.1.21 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడిగా సమర్పించారు. కానుకలను గురువారం అమ్మవారి మండపంలో లెక్కించారు. 117 రోజులకు గాను ఆలయంలో హుండీ కానుకలను లెక్కించగా నగదు రూపంలో రూ.1,21,59,030, బంగారం 57 గ్రాములు, వెండి 720 గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. కానుకలను ఆలయ సిబ్బందితో పాటు పరిటాలకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామానికి చెందిన భక్తులు లెక్కించారు. లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవోతో పాటు చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, బొసెట్టి విజయలక్ష్మి, గ్రూపు దేవాలయాల ఈవో సి.జయప్రకాష్‌బాబు పర్యవేక్షించారు.

భక్తిపారవశ్యంతో కావడి సేవ



తైపూసం కావడి సేవలో పాల్గొన్న భక్తులు

మచిలీపట్నంటౌన్: కుమారస్వామిని స్మరిస్తూ భక్తులు నగరంలో గురువారం తైపూసం కావడి సేవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు 300 మందికి పైగా భక్తులు కావిళ్లను భుజాన మోస్తూ జిల్లా పరిషత్ సెంటరులోని వినాయకుని గుడి వద్ద నుంచి కోనేరుసెంటరు, అక్కడి నుంచి రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ కావడిసేవలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని భక్తులతో పాటు కావడి మోశారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

తిరుమలగిరి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



ప్రమాణస్వీకారం చేసిన ఆలయ పాలకవర్గంతో విప్ ఉదయభాను

తిరుమలగిరి(జగ్గయ్యపేట): దేవాలయాల అభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆలయ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్‌గా కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, సభ్యులుగా చింతల నరసింహారావు, దర్శి వెంకటేశ్వర్లు, మాతంగి జయమ్మ, కూరపాటి సరస్వతీ దేవి, నెల్లూరి రమ, లింగగిరి రాంబాబు, కనిగిరి రమాదేవి, గుగులోతు మంగతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యునిగా తిరునగరి రామకృష్ణమాచార్యులుతో ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయాన్ని నూతన పాలకవర్గం మరింత అభివృద్ధి చేయాలన్నారు. భక్తుల మనోభావాలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తూ భక్తులకు సౌకర్యాలు కలిప్తోందన్నారు. గత పాలకవర్గం కూడా ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. అందుకు నిదర్శనంగా ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణతో పాటు పలు సత్రాలను కూడా నిర్మించారన్నారు. ఈ ప్రాంతంలో పెనుగంచిప్రోలు, వేదాద్రి గ్రామాల్లో కూడా పుణ్యక్షేత్రాలున్నాయని అక్కడ కూడా భక్తులకు మరింత సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.

జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు..

నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కొన్ని నెలల్లో ఈ ప్రాంత ప్రజల కల సాకారమయ్యే దిశగా జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు రానుందన్నారు. ఇప్పటికే డబ్లింగ్ లైన్‌లు, ఎలక్ట్రికల్ పనులతో పాటు రైల్వే ప్లాట్‌ఫాం నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు.

ప్యాసింజర్ రైలు ఏర్పాటుకు తనతో పాటు ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రితో మాట్లాడి కల సాకారానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. అనంతరం ఉదయభానును పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, నాయకులు వసంత రావు, జనార్దన్, ఏడుకొండలు, ఇజ్రాయిల్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు

- స్వచ్ఛ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటర్ల అవగాహన ర్యాలీ, పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత



వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటు హక్కు వినియోగించుకుంటేనే ప్రశ్నించే హక్కు ఉంటుందని వినియోగించకపోతే ఆ హక్కును కోల్పోతారని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయానికి వెళ్లినప్పుడు ఎంత మౌనంగా భక్తి శ్రద్ధలతో ప్రవర్తిస్తామో, అదే విధంగా ఓటు హక్కు వినియోగించుకునేటప్పుడు కూడా అంత సత్ప్రవర్తనతో వినియోగించుకోవాలన్నారు. భారతదేశంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియను ప్రపంచంలోని 16 దేశాల్లో అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పోలింగ్ ప్రక్రియలో ఈవీఎంలు మొరాయించాయనే సంఘటనలు మినహా రిగ్గింగ్, అక్రమాలపై ఆరోపణలు లేవన్నారు. ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. కొత్తగా ఓటును నమోదు చేసుకున్న యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని సమర్థులైన వారిని ఎన్నుకోవాలన్నారు. 2047 నాటికి భారతదేశం వైపు ప్రపంచమంతా చూసే రోజు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తాము ఓటు హక్కు వినియోగించుకోవటంతో పాటు మరికొందర్ని తీసుకువచ్చి సామాజిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వయోవృద్ధ ఓటర్లను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను బహూకరించారు. తొలుత పోటీల్లో వేసిన ముగ్గులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో ఎం.వాణి, మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, పలు కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది. మంచి పాలకులను ఎన్నుకుంటే భవిష్యత్తు బాగుంటుంది. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మంచి నాయకుడ్ని ఎన్నుకుంటాను. నాతో పాటు మరికొంత మంది ఓటు హక్కు వినియోగించుకునేలా సహాయపడతాను.

– బొల్లారపు షారోన్ లిల్లీ, పెడన

తొలిసారి ఓటు హక్కు వచ్చింది



తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం వచ్చింది. ప్రజాస్వామ్యంలో పౌరునికి లభించిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని చెప్పిన కలెక్టర్ ప్రసంగం ఎంతో ప్రేరేపించింది. నిజాయితీపరులు, ప్రజలకు సేవ చేసే నాయకులకు పట్టం కడతాను.

– పాము స్రవంతి, కంచడం, బంటుమిల్లి మండలం

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్ధల కారణంగా ధవరసింగ్ సింహాచలం(30) బుధవారం రాత్రి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కండ్రి కకు చెందిన సింహాచలం తాపీ కార్మికుడు. అతనికి తొమ్మిదేళ్ల క్రితం వసంతతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కొద్ది నెలలుగా భార్యాభర్తలు మనస్పర్ధల కారణంగా విడి విడిగా ఉంటున్నారు. సింహచలం కండ్రికలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీన ఇంటిలో ఎవరూలేని సమయంలో సింహాచలం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు వేసివున్నాయి. పక్కంటి వారి సహకారంతో తలుపులను తెరిచి చూడగా సింహాచలం ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి ధవరసింగ్ గుంపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: వ్యక్తిని కిరాతకంగా రాయితో హత్య చేసిన కేసులో కృష్ణాజిల్లా, పమిడి ముక్కల మండలం, చోరగుడికి చెందిన సి.రవికుమార్‌కు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు గురువారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర్‌రెడ్డి, కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య, కోర్టు కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ పాడిపేట, వినాయకనగర్‌కు చెందిన ఎస్.నటరాజ్, తిరుచానూరు, సరస్వతి నగర్‌లో చెత్త వస్తువుల సేకరణ వ్యాపారం నిర్వహించే వాడు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలం, బత్తలపల్లికి చెందిన తుపాకుల ఆర్ముగం భార్య, కుమారుడు చనిపోవడంతో తన బంధువైన తిరుచానూరులో ఉన్న ఒక వ్యక్తి వద్దకు వచ్చాడు. ఆర్ముగం పాత ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర పాత వస్తువులను సేకరించి నటరాజుకు విక్రయించేవాడు. మద్యం సేవించి రాత్రి సమయాల్లో ఆ షాపు ఎదురుగానే నిద్రించేవాడు. నిందితుడు రవికుమార్‌కు ఆర్ముగంనకు తరుచు తగువులు జరుగుతూ ఉండేవి. 2021 డిసెంబర్ 21వ తేదీ రాత్రి ఆర్ముగం షాపు వద్ద నిద్రిస్తుండగా నిందితుడు రవికుమార్ బండరాళ్లతో అతని తలపై బాది చంపాడు. మరుసటి రోజు ఉదయం షాపు యజమాని నటరాజ్ తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుచానూరు సీఐ సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు సీఐలు సుధాకర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి కేసు దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజ్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ద్వారా రవికుమార్‌ను నిందితుడి గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు రవికుమార్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

డబ్బులు లేవని టికెట్ ఇవ్వనన్నారు

టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎంపీ కేశినేని నానీ విమర్శలు



తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నానీ

తిరువూరు: రెండుసార్లు ఎంపీగా సేవలందించిన తనకు డబ్బులు లేవనే కారణంగా వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ నిరాకరించారని విజయవాడ ఎంపీ కేశినేని నానీ ఆరోపించారు. తిరువూరు మండల, పట్టణ వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నానీ మాట్లాడుతూ.. తాను విజయవాడ అభివృద్ధికి, పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభ్యున్నతికి ఎంపీగా శాయశక్తులా కృషి చేశానని పేర్కొన్నారు. టీడీపీలో ఎటువంటి మర్యాదా లేకపోగా, తిరువూరు రా కదలిరా సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చినపుడు గూండాలతో కొట్టించడానికి లోకేష్ యత్నించారని విమర్శించారు. చంద్రబాబు రాజకీయ జీవితానికి శాశ్వత సమాధికి తిరువూరులో జరిగిన బహిరంగ సభే వేదికగా మారిందని ఎద్దేవా చేశారు. టాటా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు, జాతీయ రహదారుల అభివృద్ధి, విజయవాడలో ఫ్లై ఓవర్ల నిర్మాణం కోసం తన హయాంలో కృషి చేశానని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఆయన విజన్‌ను సూచిస్తున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనకు, చంద్రబాబు పాలనకు పోలికే లేదన్నారు. టీడీపీ హయాంలో స్వార్థ ప్రయోజనాలే అజెండాగా మారాయని దుయ్యబట్టారు. తిరువూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తాను కృషిచేస్తానన్నారు. తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కూడా 30 ఏళ్లుగా టీడీపీని నమ్ముకున్నా డబ్బులు లేవనే కారణంగానే చంద్రబాబు తిరువూరు నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వలేదన్నారు. తిరువూరు నుంచి టీడీపీకి ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థే కరువయ్యాడని పేర్కొన్నారు. పుష్కలంగా డబ్బులు ఉన్నవారికి టికెట్ ఇవ్వాలని తండ్రీ కొడుకులు అన్వేషిస్తున్నారని ఎద్దేవా చేశారు.

అందరికీ అందుబాటులో ఉంటా...

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, కార్యకర్తలు ఏ సమయంలో ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని సూచించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో కృష్ణాకు మొదటిస్థానం

- ఉపాధి హామీ పథకం పని దినాల కల్పనలో రెండో స్థానం
- సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



సీఎస్ వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందించడంలో రాష్ట్రంలో కృష్ణా జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పనలో రెండోస్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి రీ-సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. జిల్లాలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 95 శిబిరాలు నిర్వహించి, 45,204 మందికి వైద్యపరీక్షలు చేయించామన్నారు. ఒక్కొక్క క్యాంపులో సరాసరి ఓపీ 476 మందితో రాష్ట్రంలో జిల్లా మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో ఈ ఏడాది 68 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 66.36 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచిందని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేశామన్నారు. కుటుంబంలో కనీసం ఒకరైనా ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మూడో దశ రీ-సర్వే 136 గ్రామాల్లో చేయాల్సి ఉండగా 115 గ్రామాల్లో తుది ఆర్ఓఆర్ పూర్తయిందని పేర్కొన్నారు. డీఆర్వో పెద్ది రోజా, డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ జి.గీతాబాయి, సర్వేశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ ఎ.ఎస్.ఎన్.రాధిక పాల్గొన్నారు.

1 నుంచి 69 గ్రామాల్లో పాల సేకరణ

- ఏపీడీడీసీఎఫ్ డెప్యూటీ డైరెక్టర్ వెంకట సిద్ధులు



సదస్సులో మాట్లాడుతున్న డెప్యూటీ డైరెక్టర్ వెంకటసిద్ధులు

పమిడిముక్కల(పామర్రు): ఉమ్మడి కృష్ణా జిల్లాలో జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా 20 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పాడి అభివృద్ధి సహకార సంఘం డెప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటసిద్ధులు తెలిపారు. మండలంలోని హనుమంతపురం, కపిలేశ్వరపురం గ్రామాల్లో పాడి రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో వెంకట సిద్ధులు మాట్లాడుతూ.. బాపులపాడు మండలంలోని 16 గ్రామాల్లో తొలుత మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి పాలసేకరణ ప్రారంభించినట్లు తెలిపారు. ఆ తర్వాత ఎనిమిది మండలాల పరిధిలోని 69 గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ గ్రామాల్లో పాలసేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం 146 గ్రామాల్లో సంఘాలను ఏర్పాటుచేశామని, హౌస్ హోల్డ్ సర్వే, మ్యాపింగ్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామంలో రోజుకు 600 లీటర్ల పాల సేకరణ జరుగుతోందని, పునాదిపాడులో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని వివరించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో నాలుగు చొప్పున బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. పాడి రైతుల సంఖ్య 750 నుంచి 5600లకు చేరిందని వివరించారు. మండల పశువైద్యాధికారి రాంనరేష్ మాట్లాడుతూ.. మహిళా డెయిరీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. అమూల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాక ప్రైవేటు డెయిరీలు ఇప్పటి వరకు ఏడుసార్లు పాల ధర పెంచాయని పేర్కొన్నారు. సంఘాల్లో అధునాతన మిషన్లు ఏర్పాటు చేసి, పాల నాణ్యతను పరీక్షించి రైతులకు మెరుగైన ధర చెల్లిస్తామని తెలిపారు. సంఘానికి వచ్చే లాభాలను సభ్యులకే పంచుతామన్నారు. రైతులంతా పాలుపోసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, ఏఓ రాజు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు



గిరి ప్రదక్షిణలో భక్తులు, ఉభయదాతలు, సేవా బృంద సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ గురువారం వైభవంగా జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువైన ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుర్గమ్మ భక్తులు, ఉభయదాతలు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది విశేషంగా పాల్గొన్నారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. తెల్లవారుజామున 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉండగా, దేవస్థాన ప్రచార రథం ముందుకుసాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ సాగింది. కుమ్మరిపాలెం, విద్యాధరపురం, నాలుగు స్తంభాల సెంటర్, చెరువు సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపం వరకు ప్రదక్షిణ సాగింది. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు ఆదిదంపతులకు పూజలు జరిపించుకున్నారు. ప్రతి పౌర్ణమికి నిర్వహించే గిరి ప్రదక్షిణలో పాల్గొనడం వల్ల భక్తుల మనోభీష్టం నెరవేరుతుందని, అమ్మవారి కరుణా కటాక్షాలు కలుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, చింతా సింహాచలం, ఈఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోల సేవలు భేష్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఓటర్ల జాబితా రూపకల్పనలో క్షేత్రస్థాయిలో బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వోలు) అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోపాలు లేని ఓటర్ల జాబితా రూపకల్పనలో నిబద్ధతతో సేవలు అందించిన 48 మంది బీఎల్వోలకు కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పరిశీలనకు ఇంటింటి సర్వే, అర్హులైన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా చూడటం, ప్రత్యేక ప్రచార శిబిరాల్లో కీలక భాగస్వామ్యం అందించడం, స్వీప్ కార్యక్రమాల విజయవంతానికి కృషిచేయడంలో బీఎల్వోలు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మాధురి పాల్గొన్నారు.

యడ్లపాడులో కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మృతుడి చిరునామాతో పోలీసుల తికమక
- ఆచూకీ తెలపాలంటూ పోలీసు శాఖ వినతి



సోమరాజు మృతదేహం

యడ్లపాడు (పల్నాడు జిల్లా): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన యడ్లపాడు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపురం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో ఓ వ్యక్తిని చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన పేరు సోమరాజు అని, తండ్రి పేరు లింగయ్య అని బాధితుడు తన వివరాలను వైద్యులకు చెప్పి స్పృహ కోల్పోయాడు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడు జిల్లా పేరు చెప్పకపోవడం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గన్నవరం పేరుతో మూడు గ్రామాలు ఉండటంతో పోలీసులకు మృతుడి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు 94407 96256 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ కోరారు.

109 మంది ఉద్యోగాలకు ఎంపిక

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృష్ణాజిల్లా శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు గురువారం జాబ్ మేళా నిర్వహించారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ జాబ్‌మేళాలో ఎఫ్టానిక్స్, చందు సాఫ్ట్ టెక్నాలజీస్, హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, వరుణ్ మోటార్స్, రిలయన్స్, జియో వంటి 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 423 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరవగా 109 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 128 మంది శిక్షణ అనంతరం ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్లేస్‌మెంట్ అండ్ ట్రెనింగ్ అధికారులు ఎస్.నవీన్‌కుమార్, ఎస్.ధనుంజయరావు, ఉపాధికల్పన అధికారి విక్టర్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హెచ్.వి.ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ట్రెనింగ్ అధికారి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పది పశువుల మృతి




పరమాదంలో మృత్యువాతపడిన పశువులు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో పది మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటనపై బందరు రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నం బందరుకోట వాసి బొర్రా భాస్కర వీరాంజనేయులుకు చెందిన గేదెలు బుధవారం అర్ధరాత్రి జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్నాయి. ఆరు పశువులు అక్కడికక్కడే మృతి చెందగా మరో నాలుగు తీవ్రంగా గాయపడి తరువాత మృత్యువాతపడ్డాయి. ఈ ప్రమాదంలో మరో రెండు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. గురువారం ఉదయం ఈ ప్రమాద సమాచారాన్ని స్థానికులు రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఐ శ్రీనివాస్‌యాదవ్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పశువుల యజమాని వివరాలు సేకరించి అతనికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పద్మ తెలిపారు. ఈ రోడ్డు ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానమని హామీ ఇచ్చారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్యాస్ సిలిండర్‌పై నిర్దేశించిన ధర కంటే వినియోగదారుల అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వినియోగదారులు బిల్లులో ఉన్న మొత్తం కంటే అధికంగా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. కొందరు గ్యాస్ డెలివరీ బాయ్స్, గ్యాస్ ఏజెన్సీల యజమానులు తమ గోదాము నుంచి డెలివరీ పాయింట్ దూరంగా ఉన్నందున ట్రాన్స్ పోర్ట్ చార్జీల కింద అధికంగా చెల్లించాలని వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని కంపెనీల ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, సంబంధిత అధికారులకు అధిక ధరలు వసూలు చేయొద్దని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎవరైనా అధిక మొత్తం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబరు 1967, లేదా 1800-2333-555 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సిలిండర్‌లోని గ్యాస్ బరువుపై అనుమానం ఉంటే డెలివరీబాయ్ వద్ద తూకం సరి చూసుకునే హక్కు వినియోగదారులకు ఉందని పేర్కొన్నారు. సిలిండర్ సీలు విషయంలో అనుమానాలు ఉన్నా సీలు తీసి చూపించాల్సిన బాధ్యత డెలివరీ బాయ్‌కు ఉందన్న విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని సూచించారు.

మహిళా పోలీస్ ఆత్మహత్య



మైలవరం: ప్రియుడు అనుమానించడంతో మనస్తాపం చెందిన ఓ మహిళా పోలీస్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మైలవరంలో గురువారం తెల్లవారు జామున జరిగింది. మైలవరం తారకరామానగర్‌లో నివసించే సురభి(24) కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, బొడ్డపాడు సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మైలవరం నుంచి రోజూ విధులకు వెళ్లొస్తున్నారు. తనతో పాటు చదువుకున్న ఏలూరు జిల్లా, నూజివీడు మండలానికి చెందిన యువకుడితో ఐదేళ్లుగా ఆమె ప్రేమలో ఉన్నారు. ఈ క్రమంలో సురభిపై ప్రియునికి అనుమానం ఉండటంతో బుధవారం రాత్రి ఇద్దరి మధ్య ఫోన్‌లో వివాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన సురభి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.